ఆమె ఎవరు?

వాణిశ్రీ

గోడ గడియారం ఠంగ్ ....ఠంగ్ మని తొమ్మిది గంటలు కొట్టింది.

"అప్పుడే తొమ్మిదైందే?" అంటూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు జయకృష్ణ.

"అప్పుడే అంటే!....గడియారం ముందుకు పోతుందనా మీ అర్థం?" అంది అతని భార్య నవ్వుతూ.

"అదికాదు ఈరోజు వీలైనంత తొందరగా భోజనం చేసి నిద్రపోదామనుకున్నాను. కాని తొమ్మిదైంది. నిద్ర పోయే సమయానికి పదికి తక్కువ కాదు" అన్నాడు.

"పోలీసులు నిద్రపోతే ఎట్లా? దేశం తగలబడిపోతుంది" అంది ఆమె నవ్వుతూ.

"పోలీసులు నిద్రపోతేనే మంచిదనిపిస్తోంది. దేశం ప్రశాంతంగా వుంటుందేమో?"

"పోలీసులే అలా అంటే ఎలా?"

"పోలీసునే అయినా నాకు వ్యక్తిగత అభిప్రాయాలు వుండగూడదా?"

"కూడదని ఎవరన్నారు? మీ మీద మీకే నమ్మకం తగ్గిపోతున్నట్లనిపిస్తోంది."

హాల్లో టెలిఫోన్ మ్రోగింది.

"చూడు ఏమిటో?" అన్నాడు జయకృష్ణ.

"ఇంకే ముంటుంది? ఏ మర్డర్ కేసో?...." అనుకుంటూ ఆమె వెళ్ళి టెలిఫోన్ ఎత్తింది.

"ఏమిటి?"

"మీ మెయిన్‌రోడ్ శిష్యుడు మాట్లాడతాడట" అంది.

"మెయిన్‌రోడ్ శిష్యుడు ఎవరు?"

"యస్.ఐ. గోపాల్. నెంబర్ వన్ టౌన్ యస్.ఐ. అతనేగదా, అతను వుండేది మెయిన్‌రోడ్ పోలీస్ స్టేషన్లోనే గదా. అందుకే అతన్ని మెయిన్‌రోడ్ శిష్యుడు అంటూ వుంటాను."

"బాగుంది. ఇంతకీ ఏమిటి సంగతి?"

"మామూలే. మెయిన్‌రోడ్‌లో ఘోరమైన యాక్సిడెంట్. గురువుగారు వెంటనే వున్నపాటున లేచిరావాలి."

జయకృష్ణ ఎంగిలిచేత్తోనే లేచి వెళ్ళి ఫోన్ అందుకున్నాడు.

"గోపాల్ ఏం జరిగింది?"

"మహారాణి హోటల్ ముందు చౌరస్తాకి, కొంచెం ప్రక్కగా యాక్సిడెంట్ సార్."

"ఎనీ డెత్స్?"

"యస్సార్. రోడ్డుమీద నడుస్తున్న ఒక యువతి చనిపోయింది. ఒక మోటార్ సైకిల్, మిల్క్ వ్యాన్,

అంబాసిడర్ యాక్సిడెంటయ్యాయి. మోటార్ సైకిల్ అతన్ని హాస్పటల్‌కి పంపించారు. సీరియస్‌గా వుంది అతని పరిస్థితి. అంబాసిడర్ డ్రైవర్‌కి, లోపల ఇద్దరు పాసింజెర్లకి మైనర్ ఇంజురీస్."

"శవం అక్కడే వుందా?"

"లేకపోతే ఎలా సార్. మీరు వచ్చి ఇంక్వెస్టు రిపోర్టు రాయాలి. యఫ్.ఐ.ఆర్. పంపాలిగదా?"

"నో...అలా కాదు. ఆమె ఆన్ దీస్పాట్ చనిపోయిందా లేక హాస్పటల్లో పోయిందా? అని."

"ఆన్ దీస్పాట్ పోయింది సార్. శవం కదిలించలేదు. మీరు వస్తారుగదా?"

"వస్తున్నా" .అని ఫోన్ పెట్టేసి, గబగబా రెండు ముద్దలు తిని బయల్దేరాడు సర్కిల్ ఇనస్పెక్టర్ జయకృష్ణ.

జయకృష్ణ వెళ్ళేసరికి జనం యాక్సిడెంట్ జరిగిన ప్రదేశం చుట్టూ గుమిగూడి వున్నారు.

సర్కిల్ ఇనస్పెక్టర్ని చూసి పోలీస్ కానిస్టేబుల్స్ జనాన్ని దూరంగా పంపెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు.

మిల్క్ వ్యాన్ క్రింద వుంది శవం.

ఆమెకు పాతికేళ్ళుండవచ్చు. మనిషి రంగు చామన ఛాయ. చదువుకున్న దానిలాగే కనిపించింది. మెడ బోసిగా వుంది. అవివాహితై వుంటుంది. సింపుల్‌గా వుంది డ్రెస్సింగ్. ఆమె గుప్పెట్లో హేండ్ బ్యాగ్ రక్తంలో తడిసి వుంది. ఆమె జాబ్ చేస్తూ వుందో, లేక జాబ్ కోసం ప్రయత్నిస్తూ వుందో అనుకున్నాడు జయకృష్ణ.

యాక్సిడెంట్‌కి కారణం ఏమిటో స్పష్టంగా కనిపిస్తూనే వుంది.

ఆమె రోడ్డు దాటుతూ మిల్క్ వ్యాన్ క్రిందపడి

వుండొచ్చు. వ్యాన్ డ్రైవర్ సడన్ బ్రేక్ వెయ్యడంతో దాని వెనుక నే వస్తున్న మోటారు సైకిల్ అతను కుడివైపుకి తిప్పాడు కంగారులో. అది వెళ్ళి ఎదురువస్తున్న అంబాసిడర్‌కి గుద్దుకుంది. అంబాసిడర్ ప్రక్కకి తిప్పబోయి మిల్క్ వ్యాన్‌కి గుద్దుకుని తిరగబడింది.

మూడు వాహనాలూ ముద్దగా పడి విచిత్రంగా కనిపిస్తున్నాయి.

'తప్పు ఎవరిదీ అని ఆలోచిస్తే రోడ్డు క్రాస్ చేస్తూ ప్రాణాలు కోల్పోయిన ఆమెదే' అనుకున్నాడు జయకృష్ణ.

మోటారు సైకిలిస్టు, అంబాసిడర్ డ్రైవర్, అందులో ప్రయాణీకులు హాస్పటల్లో అడ్మిటయ్యారు. మిల్కు వ్యాన్ డ్రైవర్ మాత్రం భయంతో పారిపోయాడు.

బ్రేక్ ఇనస్పెక్టర్ యాక్సిడెంట్ జరిగిన ప్రదేశాన్ని మార్కు చేసి టేప్‌తో కొలతలు వేయిస్తున్నాడు.

జయకృష్ణ ఆమె ముఖాన్ని కొంచెంసేపు పరీక్షగా చూశాడు. ఎక్కడా చూసిన గుర్తు రాలేదు.

రాత్రి పది కావొచ్చింది. సెకండ్ షో సినిమాలు మొదలయ్యాయి. రోడ్డుమీద ట్రాఫిక్ తగ్గుముఖం పట్టింది. ఎన్నో వందలమంది ఆమె శవాన్ని చూసి వెళ్తున్నారు. కాని ఎవరూ గుర్తుపట్టలేదు.

చిన్నసైజు హేండ్‌బ్యాగ్ అది. ఆమె చేతి గుప్పిట నుంచి వదిలించాడు జయకృష్ణ. సేవింగ్స్ కార్పొరేషన్ వాళ్ళిచ్చిన కాన్వాస్ సంచి అది. జిప్ తెరిచి చూశాడు. ఎరుపురంగు చీర, రెండు బ్లౌజులు, బ్రాసరీలు వున్నాయి. చిన్న నోట్ బుక్ దొరికింది.

తెరచి చూశాడు. అన్ని పేజీలూ ఖాళీగానే

వున్నాయి. ఒక్క పేజీలోమాత్రం 'శ్రీ ఎంటర్ ప్రైజెస్' అని అడ్రెస్ వుంది. ఆ నోట్ బుక్ లోనే డాక్టర్ మాధవి ప్రిస్క్రిప్షన్ రాసిన కాగితం మడతపెట్టి వుంది. డాక్టర్ మాధవి ప్రిస్క్రిప్షన్ రాసిన తేదీ చూశాడు. ఏప్రియల్ పదమూడు. ఈ రోజు పదిహేను. అంటే రెండు రోజుల క్రితమే ఆమె డాక్టర్ మాధవి నర్సింగ్ హోమ్‌లో ట్రీట్ మెంట్ తీసుకుందన్న మాట.

బట్టల అడుగున కాగితం చుట్టిన వస్తువు ఏదో వుంది. తీసి చూశాడు. కొయ్యబారి పోయాడు సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఆ వస్తువు చూసి. అది రక్తంలో తడిసిన కత్తి. ఆరు అంగుళాల పొడవు వుంది. రక్తం పచ్చిగానే వుంది.

'ఆమె ఎవర్నో కత్తితో పొడిచి చంపి హడావుడిగా పారిపోతూ మిల్క్ వ్యాన్ క్రింద పడిపోలేదుగదా' ఇన స్పెక్టర్ జయకృష్ణ బుర్ర గిరగిరా తిరిగిపోతూ వుంది.

"ఓ మైగాడ్" అన్నాడు యస్.ఐ.గోపాల్ రక్తంతో తడిసిన కత్తిని చూస్తూనే.

"ఈమె ఎవరో ఎప్పుడైనా చూశావా?" ప్రశ్నించాడు జయకృష్ణ.

"లేదు సార్" అన్నాడు గోపాల్ శవంవైపే పరీక్షగా చూస్తూ.

ఇంతలో పోలీస్ జీప్ వచ్చి ఆగింది. అందులోనుంచి యస్పీ, డియస్పీ దిగారు.

సెల్యూట్ చేసి ఎటెంక్షన్‌లో నిలబడ్డారు ఇన స్పెక్టర్లూ, కానిస్టేబుల్సు.

"వండర్ గా వుండే ఈవిడ బ్యాగ్ లో మర్డర్ చేసిన కత్తి దొరకడం" అన్నాడు యస్పీ అంతా విని.

"మర్డర్ ఎక్కడ జరిగిందో తెలియదు. బట్ కత్తి

దొరికింది. ఇటీజ్ ఏ పెక్యూలియర్ కేస్" అన్నాడు డియస్పీ.

"ఎక్కడో మర్డర్ జరిగి వుండాలి. బహుశా ఈ ప్రాంతంలోనే ఆ ప్రదేశం వుండివుండాలి" అన్నాడు యస్పీ చుట్టూ కలయజూస్తూ.

"ఎవరైనా రిపోర్టు చేసేవరకూ మనకి తెలియదు. మిస్టర్ జయకృష్ణా! అన్ని స్టేషన్స్‌కీ హెచ్చరికలు పంపండి. పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఏదైనా రిపోర్టు వచ్చిందేమో కనుక్కోండి. మర్డర్ జరిగిందని రిపోర్టు వచ్చిన వెంటనే నాకు కాల్ పంపండి."

"యస్సార్."

"రేపు ఎవరైనా ఈ మనిషిని గుర్తిస్తే సరి. లేకపోతే ఫింగర్ టిప్స్ తీసి కెమికల్ ఎగ్జామినర్‌కి పంపండి. ఈ మహాతల్లి స్టేట్ క్రిమినల్ కావచ్చుగదా." అన్నాడు యస్పీ.

"యస్సార్."

"పోస్టుమార్టమ్‌కి పంపించండి వెంటనే. ఇంక్వెస్టు రిపోర్టు తయారైందా?"

"లేదు సార్."

"త్వరగా కానివ్వండి. ఇది సిటీలో మెయిన్ రోడ్డు. హెవీ ట్రాఫిక్ వుండే రోడ్డు. ఆలస్యం కానివ్వకండి."

"యస్సార్. వెంటనే జరిపించేస్తాను సార్" అన్నాడు జయకృష్ణ.

కాస్సేపటికి యస్పీ, డియస్పీ వెళ్ళిపోయారు.

శవ పంచాయితీ జరిపించి శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపించేశాడు.

"గోపాల్,"

"యస్సార్."

"ఈ అమ్మాయి రెండు రోజుల క్రితం డాక్టర్ మాధవి దగ్గర ట్రీట్‌మెంట్ తీసుకున్నట్లు ఆధారం దొరికింది. డాక్టర్‌కి తెలిసి వుండొచ్చు ఈ అమ్మాయి ఎవరో?"

"తెలిసి వుండొచ్చు. తెలియకపోయీ వుండొచ్చు గదా సార్."

"అవుననుకో. చూద్దాం ఏ పుట్టలో ఏ పాముందో?" అన్నాడు జయకృష్ణ నవ్వుతూ.

"ఇంత రాత్రి వెళ్దామంటారా?" అనుమానంగా ప్రశ్నించాడు గోపాల్.

"నో....నో.... లేడికి లేచిందే ప్రయాణమని అర్ధరాత్రే ఇన్వెస్టిగేషన్ మొదలుపెడదామంటావా? రేపు ఉదయం లోపలే ఎక్కడో మర్డర్ జరిగిందనే వార్త ఎలాగూ వస్తుంది. ఒక్కసారే బిగిన్ చేద్దాం."

"యస్సార్."

"రెండు రోజుల్నుంచి నిద్రలేదు గదయ్యా! ఈ రోజైనా కాస్త పెందరాళే హాయిగా పడుకుందామను కున్నాను" ఆవులిస్తూ అన్నాడు సి.ఐ. జయకృష్ణ.

"మనకి హాయి ఎక్కడుంది సార్. ఎప్పుడూ హడా వుడే. ముందే తెలిసివుంటే ఈ వుద్యోగానికి వచ్చి వుండే వాడిని కాను" నవ్వాడు యస్.ఐ. గోపాల్.

"వచ్చి రెండేళ్ళు కాలేదు అప్పుడే విరక్తిగా మాట్లాడు తున్నావే. మరి మేము ఏమనుకోవాలి, ఇరవై ఏళ్ళు సర్వీసు చేసినవాళ్ళం."

"మీరు అలవాటు పడిపోయారు సార్."

"మరి నువ్వూ పడాలి అలవాటు" నవ్వాడు సి.ఐ.

"పడక తప్పుతుందా సార్!"

"నేను వెళ్తున్నాగాని ఆ మిల్క్ వ్యాన్ డ్రైవర్ ఎవరో కనుక్కొని రేపు స్టేషన్‌కి తీసుకొచ్చే ఏర్పాటు చెయ్యాలి."

"ఇంటికి వెళ్తున్నారా?"

"అంత అదృష్టంగూడానా? హాస్పటల్‌కి వెళ్ళాలి. ఆ మోటార్ సైకిలిస్టుకి తెలివి వస్తే స్టేట్‌మెంట్ తీసుకోవాలి. తెలివి రాకుండా చచ్చిపోయాడా ఇక మనకి తెల్లవార్లూ నిద్ర వుండదు. తొందరగా తెలివి వస్తే బాగుండును" అన్నాడు సి.ఐ.

"ఈపాటికి తెలివి వచ్చే వుంటుందేమో? ఫోన్ చేసి కనుక్కుందామా సార్?"

"వద్దు. నేను ఎటూ వెళ్తున్నా గదా!" అన్నాడు సి.ఐ.

2

సి.ఐ. జయకృష్ణ హాస్పటల్‌కి వెళ్ళేసరికి ఆ ఆవరణంతా జనంతో నిండిపోయి వుంది.

దాదాపు వందమంది ఆడ మగా గుమిగూడి వున్నారు.

ఆతనికి ఏం జరిగిందో అర్థం కాలేదు. యాక్సిడెంట్ జరిగిన తాలూకు వాళ్ళ బంధువులై వుంటారనుకున్నాడు.

కొందరు ఆడవాళ్ళు ఏడుస్తున్నారు. మగవాళ్ళు విచారాగ్రస్తులై వున్నారు.

తీరా విచారిస్తే ఆ మోటారు సైకిలిష్టు పోయాడని తెలిసింది.

ఆ కుర్రాడి పేరు రమేష్. నవరంగ్ సిల్క్ ఎంపోరియమ్ ప్రొప్రయిటర్ రామనాథం కొడుకు. బి.యస్సీ. ఫైనలియర్‌లో వున్నాడు.

డ్యూటీలో వున్న డాక్టర్, సి.ఐ. తో చెప్పాడు

తలకి బాగా దెబ్బ తగలడంవల్ల చనిపోయాడని. స్టేట్ మెంట్ తీసుకోడానికిగూడా అవకాశంలేకుండా స్పృహ లోకి రాకుండానే మరణించాడు.

"పోస్టుమార్టమ్ రిపోర్టు రేపు పంపుతాము సార్!" అన్నాడు డాక్టర్.

"మిగిలిన వాళ్ళు ఎక్కడున్నారు?"

"టాక్సీలో వాళ్ళా?"

"అవును."

"డ్రైవర్ని సర్జికల్ వార్డులో అడ్మిట్ చేశాం. ప్యాసింజెర్లు వెళ్ళిపోయారు. కట్టుకట్టి పంపించాం. మైనర్ ఇంజరీస్. డ్రైవర్ కి కాలు ఫ్రాక్చరైంది."

"అలాగా?"

"చూస్తారా అతన్ని."

"పదండి."

డాక్టర్, సి.ఐ. కలసి సర్జికల్ వార్డుకి వెళ్ళారు. కునికిపాట్లు పడుతున్న నర్సు బూట్లచప్పుడు విని లేచి నిల్చుని హడావుడిగా వచ్చింది.

మూలుగుతూ పడుకున్నాడు డ్రైవరు. సి.ఐ.ని, డాక్టర్ని చూసి లేచి కూర్చోబోయాడు.

సి.ఐ. వారిస్తూ "లేవకు. పడుకో ఫరవాలేదు" అన్నాడు.

వార్డుబాయ్ స్టూల్స్ తెచ్చి బెడ్ ప్రక్కన వేశాడు.

"నీ పేరేమిటి?" అని ప్రశ్నించాడు సి.ఐ.

"యాదగిరి సార్."

"యాక్సిడెంట్ ఎలా జరిగిందో ఏమైనా చెప్ప గలవా?"

"చెప్తాను సార్. నేను కళ్ళారా చూశాను,"

"చెప్పు."

"ఆ అమ్మాయి ఎవరో హడావుడిగా రోడ్డు దాటు తోంది సార్. మిల్క్‌వ్యాన్ డ్రైవరు హారన్ కొడుతూనే వున్నాడు. కాని కళ్ళుమూసి తెరిచే లోపల ఫ్రంట్ వీల్ క్రిందకి వెళ్ళిపోయింది సార్. సడన్ బ్రేక్ వేసినా లాభం లేకపోయిందనుకుంటాను. ఆమె తప్పించుకుంటుందిలే అనుకుని అతను బండి స్లో చెయ్యలేదు."

"ఐ.సీ...." తల వూపాడు సి.ఐ.

"మిల్క్‌వ్యాన్ వెనకనే వస్తున్న మోటారుసైకిల్ కుర్రాడు వ్యాన్ ఆగిపోగానే బండి ప్రక్కకి త్రిప్పి నాకు ఎదురు వచ్చాడు సార్. నేను కంగారుపడిపోయాను. ఏం చెయ్యాలో తోచలేదు. మోటారు సైకిల్‌కి గుద్దుకుంది. మా బండి బ్రేక్ వెయ్యగానే ప్రక్కకి ఒరిగిపోయింది సార్!"

"అయితే ఆ అమ్మాయి కావాలని బండిక్రింద పడినట్లు ఏదైనా అనుమానం వచ్చిందా నీకు?" ప్రశ్నించాడు జయకృష్ణ.

యాదగిరి కళ్ళు మూసుకున్నాడు కాసేపు. జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు జరిగిన సంఘటన.

"నేను అంతగా గమనించలేదు సార్. అయినా కావాలని ఎవరైనా కారు క్రింద పడతారా సార్?"

"ఎందుకు పడరూ? వాళ్ళు చస్తూ మనల్ని చంపే వాళ్ళు వుంటారు కొందరు" నవ్వుతూ అన్నాడు జయకృష్ణ.

"ఎలా చచ్చిపోవాలో తెలియక కారు క్రింద పడితే పోలా అనుకునేవాళ్ళు వుండొచ్చు" అన్నాడు డాక్టరు.

"మీకొక విషయం చెప్పలేదు" అన్నాడు జయకృష్ణ.

"ఆమె హేండ్ బ్యాగ్‌లో ఒక కత్తి దొరికింది."

"ఈజిట్?" ఆశ్చర్యపోయాడు డాక్టర్.

"యస్ డాక్టర్. అది మామూలు కత్తికాదు. దానికి రక్తంగూడా వుంది. పచ్చి పచ్చిగా వుంది. అంటే ఆ అమ్మాయి అప్పుడే ఎవర్నో చంపి హడావుడిగా పారిపోతూ యాక్సిడెంట్‌కి గురైందని నా అనుమానం" అన్నాడు జయకృష్ణ.

"ఎవరిని చంపింది?"

"అదే తెలియడం లేదు."

"అంటే మీకు ఇంకా రిపోర్టు రాలేదన్నమాట."

"లేదు. ఎక్కడో మర్డర్ జరిగింది. కాని ఎక్కడో తెలియదు."

"వండ్రఫుల్."

"మీరు రెడీగా వుండండి రేపు హాస్పటల్‌కి మూడో శవం రాబోతూ వుంది పోస్టుమార్టంకి" నవ్వుతూ అన్నాడు సి.ఐ. జయకృష్ణ.

3

పోలీస్ స్టేషన్‌లో ఫోన్ రింగైంది.

సి.ఐ. జయకృష్ణ రిసీవర్ ఎత్తి "జయకృష్ణ స్పీకింగ్" అన్నాడు.

"డియస్పీని మాట్లాడుతున్నాను."

"గుడ్‌మార్నింగ్ సార్!"

"ఏదైనా మర్డర్ జరిగినట్లు రిపోర్టు వచ్చిందా?"

"నో.... సార్!"

"ఈజిట్?"

"యస్సార్."

"రాత్రి రాకపోతే ఈ వుదయమైనా వస్తుందను

కున్నాను. ఇంకా రాలేదా?"

"నో.... సార్!"

"నాకొక అనుమానం వస్తోంది?"

"వాట్ సార్?"

"ఆ కత్తికి వున్నది మనిషి రక్తమేనా లేక ఏ కోడిని కోస్తే వచ్చిన రక్తం కాదుగదా?"

జయకృష్ణ నవ్వాడు.

"నో సార్. అది మనిషి రక్తమే. ఇంకా ఎనిమిదే గదా అయ్యింది. ఈ పూట రిపోర్టు రావచ్చును."

"ఆ అమ్మాయి ఎవరో తెలిసిందా?"

"లేదు సార్! చూస్తే ఈ వూరికి క్రొత్త అనిపిస్తోంది. త్రీడేస్ బాక్ డాక్టర్ మాధవి నర్సింగ్ హోమ్‌లో ట్రీట్‌మెంట్ తీసుకున్నట్లు ఆధారం దొరికింది. నేను అదే పనిలో వున్నాను సార్."

"వెంటనే డాక్టర్ని కలుసుకోండి."

"యస్సార్."

"ఓ.కె.

జయకృష్ణ రిసీవర్ క్రెడిల్ మీద పెట్టేశాడు.

సి.ఐ. నర్సింగ్ హోమ్‌కి వెళ్ళి హాల్లో కుర్చీలో కూర్చున్నాడు. కొందరు ఓ.పి. వార్డు బల్లలమీద కూర్చున్నారు. జనం ఎక్కువమంది లేరు. అప్పుడప్పుడే వస్తున్నారు. అంతా ఆడవాళ్ళే. ఎక్కువమంది కడుపుతో వున్నవాళ్లు. పసిపిల్లలతో వచ్చినవాళ్ళు.

కాసేపటికి నర్సు వచ్చింది.

"నమస్తే సార్!" అంది చనువుగా, ఎంతో పరిచయం వున్నదానిలా.

"నమస్తే. డాక్టర్ గారు ఇంకా రాలేదా?"

"వార్డులో వున్నారు. పది నిముషాల్లో వస్తారు సార్!"

తల వూపాడు సరేనన్నట్లు.

"డాక్టర్ గారు గైనకాలజీ స్పెషలిస్టు సార్" అంది నర్సు.

"అలాగా?" అన్నాడు.

"ట్రీట్ మెంట్ మీకా సార్?" అంది.

"నాకేం జబ్బులేదు" అన్నాడు నవ్వుతూ.

"లేదని తెలుస్తూనే వుంది సార్! కాని పొరపాటున వచ్చారేమోనని గుర్తుచేస్తున్నా సార్!" అంది నవ్వుతూ.

"ఒక కేసు ఇన్వెస్టిగేట్ చేస్తూ వచ్చాను. కొంచెం ఇన్ఫర్ మేషన్ కావాలి" అన్నాడు.

డాక్టర్ కన్సల్టింగ్ రూమ్‌లోకి వెళ్ళి కూర్చుని ఇనస్పెక్టర్ని రమ్మని కబురుచేసింది.

"నమస్తే డాక్టర్" అన్నాడు.

"నమస్తే!" అంది ఆమె.

సి.ఐ. ప్రిస్క్రిప్షన్ చీటీ ఆమె చేతికిచ్చి "ఈ అమ్మాయి మీ వద్ద ట్రీట్ మెంట్ తీసుకుంది. గుర్తుపట్టగలరా?" అన్నాడు.

"యస్. ఏం కావాలి మీకు?"

"ఆమె రాత్రి షుమారు తొమ్మిది గంటలకు మెయిన్ రోడ్డులో యాక్సిడెంట్ జరిగి మరణించింది" అన్నాడు.

డాక్టర్ మాధవి తృళ్ళిపడి "నిజంగా?" అంది నమ్మలేనట్లుగా చూస్తూ.

"నిజం డాక్టర్. ఆమె ఎవరో ఏమిటో ఎవరూ ఐడెంటిఫై చెయ్యలేదు. ఆమె బ్యాగ్‌లో ఈ చీటీ దొరికింది. మీ పేరు వుందిగాని పేషెంట్ పేరు లేదు.

అందుకే మీకు తెలిసి వుంటుందేమోనని వచ్చాను."

"తెలుసు. ఆమె పేరు రాజేశ్వరి. ఇక్కడ రెండు రోజులు ఇన్ పేషెంట్ గా వుందిగూడా!" అంది డాక్టర్ మాధవి.

"ఇన్ పేషెంట్ గానా?"

"అవును."

"ఎందుకు?"

"మెన్సెస్ ట్రబుల్."

"ఐ.సీ. ఆమె అడ్రస్ మీకు తెలుసా?"

"తెలియదు."

"తెలియదా?"

"వుహూం...." పెదవి విరిచింది డాక్టర్ మాధవి.

"మరి ఆమెను ఎవరు అడ్మిట్ చేశారు?"

"నా తమ్ముడు."

"అతనికి పరిచయం వుందా?"

"బస్సులో పరిచయమట."

"ఆమె గురించి మీరేమైనా చెప్పగలరా?"

"ఆమె గురించి నేనేం చెప్పగలను? ఆమె జబ్బుగురించి చెప్పగలనుగాని" నవ్వింది డాక్టర్.

"జబ్బుగురించి వివరాలు అక్కర్లేదు. ఆమె ఎవరు? చెప్పగలిగితే చెప్పండి. తల్లిదండ్రులు ఎవరో తెలి స్తే శవాన్ని అప్పగిస్తాము" అన్నాడు.

"ఆమె ఈ వూరు మనిషి కాదనుకుంటాను. అయినా నాకు వివరాలు తెలియవు. మా తమ్ముడు ఆమెను తీసు కొచ్చి అడ్మిట్ చేశాడు. రెండు రోజులుంచి ఈ క్యాప్సిల్స్ వాడమని రాసిచ్చాను. తర్వాత నాకు కనిపించలేదు" అంది డాక్టర్ మాధవి.

"ఆమె గురించి మీ తమ్ముడు ఏం చెప్పాడు?"

"ఆ సమయంలో నేను లేను. నా అసిస్టెంట్ డాక్టర్ సుశీల వుంది. మా తమ్ముడు ఆమెను అడ్మిట్ చేసి వెళ్ళాడనీ, బిల్లు తనే ఇస్తానన్నాడనీ ఆమెకు డైట్ కూడా ఇవ్వమని చెప్పాడనీ తెలిసింది. తర్వాత అంటే మర్నాడు నాకు ఫోన్ చేశాడు. బస్సులో పరిచయమైందనీ, బాధ పడుతూ వుంటే తీసుకొచ్చి అడ్మిట్ చేశాననీ చెప్పాడు. వాడు తర్వాత రాలేదు. రెండు రోజుల తర్వాత డిశ్చార్జి చేశాను."

"ఐ.సీ....అయితే ఆమె పూర్తి వివరాలు మీ తమ్ముడికి తెలిసి వుండాలి" అన్నాడు.

"వుండొచ్చు" అంది మాధవి.

"అడ్రస్ చెప్పండి. వెళ్ళి కలుసుకుంటాను."

"బి. గంగరాజు, ఇన్కమ్‌టాక్స్ ప్రాక్టీషనర్, కొత్తపేట. చౌరాస్తాలో బోస్ బొమ్మ వుంది చూడండి. కుడి ప్రక్కగా వెళ్తే ఆఫీసు కనిపిస్తుంది" అంది డాక్టర్ మాధవి.

"థాంక్స్" అని లేచాడు జయకృష్ణ.

"నో మెన్షన్" అంది డాక్టర్ మాధవి.

4

ఆఫీసు ముందు పోలీస్ వ్యాన్ ఆగడంచూసి ఆఫీస్ బాయ్ బైటకు వచ్చి తొంగిచూసి వెళ్ళాడు.

సి.ఐ. జయకృష్ణ విజిటర్సు రూమ్‌లో కూర్చున్నాడు.

గంగరాజు గది బైటకు వచ్చి "లోపలకి రండి" అన్నాడు విష్ చేసి.

"ఏమిటి ఇలా వచ్చారు? పోలీసులు వచ్చారంటే ఏదో

విశేషమే" అన్నాడు గంగరాజు నవ్వుతూ.

"రాజేశ్వరి గురించి వివరాలు అడగడానికి వచ్చాను. ఆమె రాత్రి మెయిన్ రోడ్డులో యాక్సిడెంట్లై చని పోయింది" అన్నాడు.

"రాజేశ్వరా? ఆమె ఎవరు?" అన్నాడు గంగరాజు ఆశ్చర్యపోతూ.

'ఆమె ఎవరో తెలియక ఈయన దగ్గరికి వస్తే 'ఆమె ఎవరు?' అని ఎదురుప్రశ్న వేస్తాడేమిటి కర్మ' అనుకుని అనుమానంగా చూశాడు జయకృష్ణ.

గంగరాజుకి దాదాపు నలభై ఏళ్ళుంటాయి. ఎత్తుగా, హుందాగా వున్నాడు. తలలో అక్కడక్కడా తెల్ల వెంట్రుకలు వున్నా, వొత్తుగానే వుంది తల.

టేబుల్ నిండా వున్న ఫైల్సు, ఎక్కౌంట్ బుక్సు, బీరువాల నిండా వున్న రిఫరెన్సు బుక్సు చూస్తుంటే అ సమానూ బిజీగా వుండే మనిషని తెలిసిపోతూనే వుంది. ఇటువంటివాళ్ళు వాళ్ళ పనిలో తప్ప తక్కిన విషయాల్లో ఆసక్తి కలిగి వుండరు. ఇతను అటువంటి వాడేనా? రాజేశ్వరికి ఇతనికీ సంబంధం ఏమిటి?

"రాజేశ్వరి ఎవరో నాకు గుర్తురావడం లేదు. ఆమె ఏ కంపెనీకి చెందినది?"

అతని మాటలకు అడ్డువచ్చి "ఆమె ఏ కంపెనీకి చెంది నదో నాకు తెలియదు. మూడు రోజుల క్రితం మీరు స్వయంగా మీ అక్కగారి నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేయించారటగా!"

గంగరాజు కొన్ని క్షణాలపాటు కళ్ళు మూసుకుని "ఓ.... ఆమా!.... నేను ఎవరో అనుకుంటున్నాను. ఏమిటీ ఆమె చనిపోయిందా?" అన్నాడు.

"అవునండీ పాపం. రోడ్డు క్రాస్ చేస్తూ మిల్క్ వ్యాన్ క్రిందపడి చనిపోయింది."

"అయ్యో!........అంటూ" విచారం వ్యక్తపరిచాడు గంగరాజు.

"ఆమె శవం మార్చురీలో వుంది. బంధువులు వస్తే అప్పగించాలి గదా! అందుకే మీకు తెలిసి వుంటుందని వచ్చాను. ఇంతకీ ఆమెకూ మీకు ఏమిటి సంబంధం?"

గంగరాజు కొంచెం కంగారుపడినట్లు కనిపించాడు. తర్వాత సర్దుకుని "నాకూ ఆమెకూ ఏమీ సంబంధం లేదు. ఆమె ఎవరో అసలు?" అన్నాడు.

"ఏమీ సంబంధం లేకపోతే చాలా ఇంట్రెస్ట్ తీసుకుని ఆమెను మీ అక్కగారి నర్సింగ్ హోమ్‌లో ఎందుకు జేర్పించారు? బిల్లు గూడా మీరే పే చేస్తానన్నారనీ, ఆమె వద్ద వసూలు చెయ్యొద్దన్నారనీ తెలిసింది."

"అవును. నిజమే. అసలు జరిగింది చెప్తాను వినండి. విజయవాడ నుంచి సూపర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నాం. ఈ వూరు చేరేసరికి దాదాపు రాత్రి ఎనిమిది దాటుతోంది. అంతకు ముందు అరగంట నుంచీ మా ప్రక్కసీట్లోనే కూర్చున్న ఈ అమ్మాయి ఎందుకో బాధపడుతోంది. నా భార్య ఆమెను అడిగింది.

ఆమె ఏం చెప్పిందో గాని బస్టాండు కొంచెం దూరంలో వుండగా నా భార్య మా అక్కగారి నర్సింగ్ హోమ్‌లో చేర్పించమని అడిగింది. ఆమెకు తోడు ఎవరూ లేరని చెప్పింది. అదేదో ఆడవాళ్ళకు సంబంధించిన వ్యాధి అని చెప్పింది. బస్టాండుకు వెళ్ళే దోవలోనే మా అక్కగారి నర్సింగ్ హోమ్ వుంది. కండక్టర్ని రిక్వెస్టు చేసి అక్కడ బస్సు ఆపి దిగిపోయాం. ఆమెను అందులో అడ్మిట్ చేసి

మేం ఇంటికి వెళ్ళిపోయాం. అంతే. అంతకంటే వివరాలు నాకు తెలియవు."

అదంతా వింటూ తల పట్టుకుని కూర్చున్నాడు సి.ఐ. జయకృష్ణ.

"అయితే, ఆమె ఒంటరిగా విజయవాడ నుంచి వచ్చిందని మీకు తెలుసు. అంతే."

"అంతే. ఆ బస్సు విజయవాడనుంచి బయల్దేరింది. ఆమె మాతో పాటు అక్కడ్నుంచి వచ్చింది."

"అంతకంటే మీకు వివరాలు తెలియవు."

"లేదు సార్!"

"సరే సార్! వెళ్ళొస్తాను. అవసరమైతే మళ్ళీ కలుసుకుంటాను. థాంక్స్" అని సెలవు తీసుకుని బైటపడ్డాడు సి.ఐ.

స్టేషన్‌కి వచ్చేసరికి పది దాటింది.

"మీకోసమే ఎదురుచూస్తున్నాను సార్!" అన్నాడు యస్.ఐ. గోపాల్.

"ఏమిటి విశేషం?"

"మిల్క్ వ్యాన్ డ్రైవరు దొరికాడు. వాడిని లాకప్‌లో పడేశాను."

"అంతేనా? యేమంటున్నాడు?"

"ఏమంటాడు? నా తప్పేం లేదని మొత్తుకుంటున్నాడు."

"డ్రైవర్లు ఇంకేమంటారు?"

"విశేషం అదికాదు. మహారాణి హోటల్ మేనేజర్ వచ్చి వెళ్ళాడు."

"ఎందుకూ?"

"రూమ్ నెంబరు 116 రేఖా ఎంటర్‌ప్రైజెస్ మేనే

జింగ్ పార్టనర్ కుమారస్వామి పేరుతో బుక్ చేసి వుందట. రాత్రి అతను అందులో నిద్రపోయాడట. మర్నాడు అంటే ఈ రోజు వుదయం తలుపులు తెరవలేదట. పంచనామా చేసి తలుపులు తెరవమని అప్లికేషన్ రాసిచ్చిపోయాడు. అందులో ఆ కుమారస్వామి సూసైడ్ చేసుకున్నాడేమోనని డౌట్ పడుతున్నాడు."

జయకృష్ణ కుర్చీలో కూర్చుని తల పైకెత్తి ఆలోచిస్తున్నాడు.

"ఏమిటి సార్ ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు. రాజేశ్వరి కుమారస్వామిని మర్డర్ చేసి పారిపోతూ మిల్క్ వ్యాన్ క్రిందపడి చనిపోయిందా? అని ఆలోచిస్తున్నాను."

"రాజేశ్వరి ఆమె పేరా?"

"అవును. డాక్టర్ మాధవి నర్సింగ్ హోమ్‌కి వెళ్ళి వస్తున్నాను. కాని వివరాలు ఎవరికీ తెలియవు. రాజేశ్వరి విజయవాడ నుంచి ఒంటరిగా వచ్చిందని చెప్పారు."

"కుమారస్వామిని రాజేశ్వరి మర్డర్ చేసి వుంటుందని ఎలా వూహిస్తున్నారు?" ప్రశ్నించాడు యస్.ఐ.

జయకృష్ణ నవ్వాడు.

"పద చూద్దాం. కుమారస్వామి సూసైడ్ చేసుకుని వుంటే నా ఐడియా తప్పు. మర్డర్ చేసివుంటే ఆ చేసింది ఖచ్చితంగా రాజేశ్వరే" అన్నాడు జయకృష్ణ కుర్చీలో నుంచి లేస్తూ.

5

మహారాణి హోటల్ రూమ్ నెంబరు 116 బ్రేక్ చేశారు.

వెల్లకిలా పడుకుని బెడ్ మీద వుంది శవం. రెండు

చేతులూ వెనక్కి విరిచి కట్టివున్నాయి నైలాన్ తాడుతో. నోట్లో గుడ్డలు కుక్కి వున్నాయి. గుండెలో, మెడమీద, పొట్టలో కత్తిపోట్లు వున్నాయి.

దాదాపు పది కత్తిపోట్లు. ఎవరో కసితీరా పొడిచినట్లు వుంది.

హోటల్ మేనేజర్ భయంగా చూశాడు ఇన్స్పెక్టర్ వంక.

"ఇతనేనా కుమారస్వామి?" ప్రశ్నించాడు జయకృష్ణ.

"అవున్సార్?"

"ఇతను తరచుగా మీ హోటల్లో రూమ్ తీసుకుంటూ వుంటాడా?"

"గెస్టుకోసం అని విజిటింగ్ రిజిష్టర్లో రాయించి తీసుకుంటూ వుంటాడు."

"ఐ.సీ...." అంటూ రూమ్ మొత్తం పరిశీలనగా చూశాడు.

ప్లైవుడ్ పార్టీషన్ అవతలకి వెళ్ళి చూశాడు. సన్ గ్లాస్ టేబుల్, నాలుగు కుర్చీలు వున్నాయి. టేబుల్ మీద రకరకాల డిషెష్, జానీవాకర్ విస్కీ బాటిల్ వున్నాయి. ఇద్దరు కూర్చుని భోజనం చేసినట్లు రెండు ఎంగిలి ప్లేట్లు అలాగే వున్నాయి! విస్కీ బాటిల్లో మూడు వంతులు ఖాళీ అయింది. నాలుగో వంతు ద్రవం వుంది సీసాలో.

"కుమారస్వామితో పాటు మరొక అమ్మాయి వచ్చింది. ఎవరు ఆమె?" ప్రశ్నించాడు జయకృష్ణ.

భయంగా చూశాడు హోటల్ మేనేజర్.

"ఎవరో సార్ నేను చూడలేదు."

"మీరు చూసే వుండాలి."

"లేదు సార్. నేను రెస్టారెంట్ కౌంటర్లో వున్నాను. లాడ్జింగ్ కి వెళ్ళే మార్గం ప్రక్కగా వుంది. రెస్టారెంట్ లో కూర్చున్నవాళ్ళు చూడకుండానే లాడ్జింగ్ కి ఎవరైనా వెళ్ళిపోవచ్చు."

"కార్లో వస్తే?"

"కారు పార్కు చేసి వెళ్తారు."

"కారు పార్కు మీకు కనిపిస్తుంది గదా!"

"కనిపిస్తుంది."

"కుమారస్వామి ఎప్పుడు వచ్చాడు?"

"కారులోనే వచ్చాడు. సాయంకాలం నాలుగింటికి."

"వెంట ఎవరున్నారు?"

"ఎవరూ లేరు. ఒంటరిగానే వచ్చాడు."

"నో....మీరు అబద్ధం చెపుతున్నారు. నిజం చెప్పండి. లేకపోతే చాల సీరియస్ గా వుంటుంది వ్యవహారం" కటువుగా అన్నాడు జయకృష్ణ.

"నిజం సార్. నేను ఆమె ఎవరో చూడలేదు."

"అయితే మీ హోటల్ బ్రోతల్ హౌస్ గా కూడా వుపయోగపడుతుందన్న మాట."

"అన్ని హోటల్స్ అంతే సార్! ఎవరు మొగుడూ పెళ్ళాలో ఎవరికి తెలుసు? రోజుకి వందరూపాయలు అద్దె మాకు కావాలి. ఎవరొచ్చినా ఇవ్వక తప్పదు. అంతా ఘరానా పెద్దమనుషులే" అన్నాడు హోటల్ మేనేజర్.

"మీ లాడ్జింగ్ లో పనిచేసే బాయిస్ ని ఒక్కసారి పిలిపించండి."

"అలాగే."

కాసేపటికి ఒక్కొక్కళ్ళే రాసాగారు. అందర్నీ ప్రశ్నించాడు జయకృష్ణ.

రాజయ్య అనే కుర్రాడు ఎవరో ఆడమనిషి వచ్చిందని చెప్పాడు. కాని ముఖం చూడలేదట. రెస్టారెంట్ నుంచి క్యారేజి తెచ్చిపెట్టాననీ, అప్పుడామె బాత్ రూమ్ లోకి వెళ్తూ వుంటే చూశాననీ, ముఖం కన్పించలేదనీ చెప్పాడు. క్యారేజి తెచ్చాక తనను వెళ్ళిపొమ్మన్నారనీ, తర్వాత లోపల బోల్టు పెట్టుకున్నారనీ ఖచ్చితంగా చెప్పాడు.

ఫింగర్ ప్రింట్ ఎక్స్పర్టు వచ్చి గ్లాసులమీద డిష్ల మీద పౌడర్ చల్లి ప్రింట్స్ ట్రేస్ చేస్తున్నాడు.

కాసేపటికి కుమారస్వామి బంధువులు వచ్చారు.

శవ పంచాయితీ జరిపి శవాన్ని పోస్టుమార్టమ్కి పంపించారు.

6

"కుమారస్వామి నాకు మేనమామ కొడుకు" అన్నాడు మేనేజర్ సీట్లో కూర్చున్న అతను.

నేమ్ బోర్డువంక చూశాడు సి.ఐ. జయకృష్ణ.

"ఆర్.కె. మూర్తి, బి.కామ్.," అని వుంది.

"చూడండి మూర్తిగారూ! కుమారస్వామి గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి. చెడ్డవైనా సరే దాచకండి. కేసు ఈజీగా సాల్వ్ చెయ్యడానికి ఒక చిన్న విషయం సహాయపడవచ్చు" అన్నాడు జయకృష్ణ.

"అడగండి సార్. మీకేం కావాలన్నా నిజం చెప్తాను. వాడు పోయాక ఇక దాచుకోవడానికేముంటాయి?" విచారంగా అన్నాడు మూర్తి.

"కుమారస్వామికి చెడు అలవాట్లు వున్నాయా?"

"చెడు అలవాట్లు అంటే మీ దృష్టిలో ఏమిటో ముందు చెప్పండి."

"ఆడవాళ్ళతో వ్యభిచరించడం...."

"నాకు తెలిసినంతవరకూ వాడు మంచివాడు. పార్టీలలో తప్ప డ్రింక్ తీసుకోడు. ఆరోగ్య సూత్రాలు చాలా వరకూ పాటిస్తాడు. ఇక ఆడవాళ్ళ కోసం ప్రాకులాడినట్లు నేనెప్పుడూ నోటీస్ చెయ్యలేదు. మా కంపెనీలోనే దాదాపు పదిమంది ఆడపిల్లలు జాబ్ చేస్తున్నారు. ఎవరితోనూ డీలింగ్స్ లేవని ఖచ్చితంగా చెప్పగలను" అన్నాడు మూర్తి.

"మీరు భ్రమపడుతున్నారేమోనని నేను సందేహిస్తున్నాను."

"కావచ్చు. నిప్పులేనిదే పొగరాదనే సామెత వుంది గదా! అసలా పొగ సంగతే నా నోటీస్‌లోకి రానప్పుడు! నిప్పు సంగతి ఏం చెప్పగలను?"

"మీరు చెప్పేవాటికి జరిగిన సంఘటనకీ ఎక్కడా పొత్తు కుదరటం లేదు. కుమారస్వామి మహారాణి హోటల్లో గెస్టుకోసం రూమ్ బుక్ చేశాడు. విజిటర్స్ రిజిష్టరులో అతనే స్వయంగా సైన్ చేశాడు. ఆ రోజు అతని గదిలో రాజేశ్వరి గడిపినట్లు సాక్ష్యం వుంది. అతని శరీరంపై వున్న కత్తిపోట్లు రాజేశ్వరి బ్యాగ్‌లో దొరికిన కత్తితో పొడిచినట్లు రుజువైంది. రాజేశ్వరి అతన్ని చంపినట్లు తేలింది."

తల వూపాడు మూర్తి.

"రాజేశ్వరి ఎవరు? అనే విషయం తేలడం లేదు. మీరెప్పుడైనా ఆమెను చూశారా?" అంటూ డైరీలోనుంచి ఫొటోలు తీసి టేబుల్ మీద పెట్టాడు.

మూర్తి పరీక్షగా చూశాడు ఫొటోలన్నీ.

"లేదుసార్. ఈమెను ఎప్పుడూ చూళ్ళేదు" అన్నాడు

మూర్తి.

"కుమారస్వామికి పెళ్ళయి యెంతకాలమైంది?"

"పదేళ్ళు కావచ్చు. నా చెల్లెల్నే యిచ్చి పెళ్ళిచేశాం. ముగ్గురు పిల్లలు గూడా!" విచారంగా అన్నాడు మూర్తి.

"కుమారస్వామి ప్రవర్తన మంచిది. ఆడవాళ్ళతో డీలింగ్స్ లేవని చెప్తున్నారు. పోనీ అతను పూర్వాశ్రమంలో రాజేశ్వరిని ప్రేమించి వుండే అవకాశం వుందా?"

"చదువుకునే రోజుల్లో సంగతి చెప్పలేను. కాని ఆమె విజయవాడనుంచి వచ్చిందంటున్నారు. మావాడు విజయవాడలో యెప్పుడూ వుండలేదు. బి.యస్సీ. ఇక్కడే ప్యాసయ్యాడు. తర్వాత గిండీ ఇంజనీరింగ్ కాలేజీలో చదివాడు."

"ఆమె విజయవాడ నుంచి బస్సులో వచ్చింది. అంత మాత్రాన ఆమె నేటివ్ విజయవాడ అని నిర్ధారించలేం గదా!"

తల వూపాడు మూర్తి.

బాయ్ స్ప్రింగ్ డోర్ తెరచి ట్రేలో కూల్ డ్రింక్స్ తెచ్చి సర్వ్ చేశాడు.

"ప్లీజ్ టేకిట్" అన్నాడు మూర్తి స్ట్రా నోట్లో పెట్టుకుంటూ.

జయకృష్ణ కూల్ డ్రింక్ బాటిల్ నోట్లో పెట్టుకున్నాడు స్ట్రా అవతల పారేసి.

"నాకు ఇలా తాగటం ఇష్టం" అన్నాడు.

నవ్వాడు మూర్తి.

"రాజేశ్వరి, కుమారస్వామిని ప్రేమించి వుండొచ్చా? భగ్నప్రేమతో అతనిమీద కసి తీర్చుకుని...."

జయకృష్ణ మాటలకు అడ్డువస్తూ "అలా జరిగి వుండ

డానికి ఎలా అవకాశం వుంటుంది? వాడికి పెళ్ళయి పదేళ్ళు దాటింది. వాడి మీద కసి,కోపం వుంటే ఇన్నేళ్ళు వూరు కుంటారా ఎవరైనా?" అన్నాడు.

"చెప్పలేం. కుమారస్వామి ఆమెను ఇన్నాళ్ళూ మభ్య పెడుతూ వుండొచ్చును. ఆమె ఇక సహించలేక తెగించి అతన్ని చంపి వుండొచ్చు."

"అనుకోవడానికి ఎన్నో అనుకోవచ్చును. కాని నా కెందుకో ఇది వాడి లౌ ఎఫైర్ అనిపించడం లేదు. మనకు తెలియని రహస్యం ఏదో వుందని నాకు అనుమానంగా వుంది" అన్నాడు మూర్తి.

"వుండొచ్చును. మనం అన్ని కోణాల నుంచి కారణాలు వెతకాలి. కేసుకు అసలు కారణం తెలిసే వరకూ అన్నీ అనుమానించదగినవే" అన్నాడు జయకృష్ణ.

"మే బీ" అన్నాడు మూర్తి తల వూపుతూ.

"నేను మీ సిస్టర్ని కలుసుకోవాలనుకుంటున్నాను."

"తప్పకుండా." అంటూ బజర్ నొక్కాడు.

బాయ్ వచ్చాక "డ్రైవర్ని కారు పోర్టికోలో పెట్ట మను" అన్నాడు.

ఇద్దరూ రూమ్ బైటకు వచ్చారు.

"నాకు బండి వుంది లెండి" అన్నాడు జయకృష్ణ.

"మీ బండి వెనుక వస్తుంది. రండి ఇద్దరం నా కారులో వెళ్దాం" అన్నాడు.

"ఫరవాలేదు మీరు రండి" అంటూ జయకృష్ణ పోలీస్ వ్యాన్‌లో యెక్కి కూర్చున్నాడు.

ముందు మూర్తి కూర్చున్న ఫియట్‌ని అనుసరిస్తోంది పోలీస్ వ్యాన్.

ఆ వీధిలోకల్లా విశాలమైన ఆవరణలో కట్టబడిన

మూడంతస్తుల మేడ ముందు ఆగింది ఫియట్. ఇనుప గేటు మూసి వుంది. డ్రైవరు హారన్ కొట్టాడు. కాసేపటికి వాచ్ మాన్ వచ్చి గేటు బార్లా తీశాడు.

"రండి సార్!" అంటూ లోపలకు ఆహ్వానించాడు మూర్తి.

జయకృష్ణ, మూర్తిని అనుసరించి వెళ్ళాడు.

హాల్లో సోఫాలో కూర్చోబెట్టి మూర్తి మేడపైకి వెళ్ళాడు. కొంచెం సేపటికి దిగి వచ్చాడు.

"పైకి రండి సార్" అన్నాడు.

జయకృష్ణ అతన్ని అనుసరిస్తూ "మీ సిస్టర్ పేరు?" అన్నాడు.

"అరుణ."

సర్కిల్ ఇనస్పెక్టర్ని చూస్తూనే అరుణకి దుఃఖం ముంచుకొచ్చింది.

"వూరుకోమ్మా! మీరెంతో బాధలో వున్నారు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం భావ్యంకాదు. కాని ఇది మర్డర్ కేసు. ఇన్వెస్టిగేట్ చేసి హంతకుల్ని పట్టుకోవడం, అందుకు కారణాలు వెతికి పై అధికారికి రిపోర్టు చెయ్యడం వంటి బాధ్యతలున్నాయి. అందుకే తప్పని పరిస్థితిలో మిమ్మల్ని ఇబ్బంది పెట్టవలసి వచ్చింది" అన్నాడు.

అరుణ కాసేపటికి వూరడిల్లింది. చీర చెంగుతో కళ్ళు తుడుచుకుని "కూర్చోండి" అంది.

జయకృష్ణ కూర్చున్నాడు.

మూర్తి బాల్కనీలోకి వెళ్ళిపోయి పచార్లు చేస్తూ వున్నాడు.

"మీకు పెళ్ళయి పదేళ్ళయింది కదూ!"

అరుణ తల వూపింది అవునన్నట్లు.

"మీ భర్త చాల మంచివాడని మూర్తిగారు చెప్పారు."

ఆమె ఏమీ మాట్లాడలేదు. శూన్యంలోకి చూస్తూ వుంది.

"మీకు తెలిసిన సంగతేగదా! మీ భర్తని రాజేశ్వరి అనే అమ్మాయి చంపింది. మీ రెప్పుడైనా ఆమెను చూశారేమో గుర్తుకు తెచ్చుకోండి" అంటూ డైరీలో నుంచి రాజేశ్వరి ఫొటోలు ఆమెకు అందించాడు.

అరుణ నీళ్ళునిండిన కళ్ళను తుడుచుకుని తదేకంగా ఆ ఫొటోలను చూసింది.

తల అడ్డంగా వూపుతూ "ఆమెను ఎప్పుడూ చూళ్ళేదు సార్" అంది.

"పోనీ మీ పెళ్ళికాక పూర్వం మీ భర్త ఎవర్నయినా ప్రేమించారని మీకేమైనా తెలుసా?"

అరుణ అనుమానంగా చూసింది.

"నా వుద్దేశ్యం కరెక్టు కాకపోవచ్చును. మీకేమైనా తెలిసి వుంటే చెప్పండి" అన్నాడు.

"లేదుసార్. నాకేమీ తెలియదు" అంది.

జయకృష్ణ దృష్టి క్రింద అంతస్థులో లైఫ్ సైజు ఫొటో మీద పడింది. అది కుమారస్వామిదే. ఆ ఫొటోకి పూల దండ వేసివుంది. నుదుట కుంకుమబొట్టు పెట్టారు. కాని ఆ పూలదండ ఎండిపోయి వుంది. అది గులాబీ పూలదండ.

జయకృష్ణకి ఆశ్చర్యం వేసింది. కుమారస్వామి చని పోయి రెండు రోజులు కాలేదు. అప్పుడే పూలదండ వెయ్యడమూ, అది ఎండిపోవడమూ ఎలా సంభవించి వుంటుంది?

"థాంక్స్ అరుణగారూ! అవసరమైతే మిమ్మల్ని

మళ్ళీ కలుసుకుంటూాను" అన్నాడు.

మూర్తితో కలిసి క్రిందకు దిగివచ్చాడు.

ఆ ఫోటో ముందు ఆగి తల పైకెత్తి చూశాడు. రంగూన్ స్టూడియో అని డేట్ స్టాంపు వుంది. అక్టోబరు 16, 1976 తారీఖున తీసిన ఫోటో అది. నాలుగేళ్ళ క్రితం ఫోటో కాబట్టి కుమారస్వామి ముఖం కొంచెం లేతగా వుంది.

ఆ పూలదండ సంగతి ఎలా ప్రశ్నించాలో అతనికి అర్థం కాలేదు. బ్రతికున్న వారికి ఎవరైనా పూలదండ వేస్తారా?

"ఈ ఫోటో...." అని ప్రశ్నార్థకంగా చూశాడు మూర్తి వైపు.

"ఇది సుధాకర్ ది" అన్నాడు మూర్తి.

జయకృష్ణ ఆశ్చర్యపోయాడు.

"సుధాకర్ ఎవరు?" అన్నాడు.

"కుమారస్వామి తమ్ముడు. వాడు చనిపోయి మూడేళ్ళయింది. సడన్ గా పోయాడు. బ్లడ్ క్యాన్సర్" అన్నాడు మూర్తి.

"ఐ.సీ....అచ్చం కుమారస్వామి లాగే వున్నాడు. అతని ఫోటో అనుకున్నాను" అన్నాడు జయకృష్ణ ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ.

"ఇద్దరూ ఒకలాగే వుంటారు రూపంలో. కుమారస్వామికంటే రెండేళ్ళు చిన్నవాడు వీడు. ప్రవర్తనలో పోలికలు లేవు ఇద్దరికీ. వాడు బాగా చదువుకుని ఇంజనీరై వ్యాపారాన్ని వృద్ధి చేస్తే, వీడికి చదువు వంటబట్టక చెడు తిరుగుళ్ళు తిరిగి రోగాల పాలై పోయాడు."

"ఐతే ఇతను చనిపోయేముందు ఎక్కడ వుండేవాడు?"

"ఇక్కడే వుండేవాడు. కుమారస్వామి తమ్ముడి గురించి పట్టించుకునేవాడు కాదు. వాడు యెక్కడెక్కడో తిరుగుతూ విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెడుతూ వుండేవాడు."

జయకృష్ణ నడుస్తున్నవాడల్లా ఆగి "అయితే సుధాకర్ ఎప్పుడైనా విజయవాడలో చదువుకున్నాడా?" అని ప్రశ్నించాడు.

మూర్తి ఆలోచనలోపడి "యస్ ఇనస్పెక్టర్ గారూ! రెండేళ్ళు విజయవాడలోనే హాస్టల్లో చదువుకున్నాడు. కరక్టే. ఇప్పుడు గుర్తుకొస్తోంది. ఏడెనిమిదేళ్ళ క్రితం అనుకుంటాను. అప్పుడు వాళ్ళ ఫాదర్ బ్రతికే వున్నాడు. ఇంట్లో వుండి సరిగా చదవడం లేదని విజయవాడ పంపించారు. కాని అక్కడా అంతే. ఇంటర్ గూడా ప్యాసవలేక పోయాడు. పైగా అన్నీ తగాదాలు తెచ్చేవాడని వాళ్ళ ప్రిన్సిపాల్ లెటర్సు రాసేవాడు" అన్నాడు.

"నాకిప్పుడు ఒక అనుమానం వస్తోంది. సుధాకర్ అనుకుని అతని విరోధులు ఎవరైనా అంటే రాజేశ్వరి కుమారస్వామిని మర్డర్ చెయ్యలేరుగదా!"

మూర్తి నవ్వాడు.

"సుధాకర్ చనిపోయి మూడేళ్ళయింది. అతనిమీద పగవున్న వాళ్ళు ఇన్నాళ్ళూ ఏం చేశారు? పైగా సుధాకర్ చనిపోయాడని ఆ మాత్రం తెలుసుకోకుండా ఇంత దారుణం చేస్తారా?"

"సమ్ మిస్టేక్ ఈజ్ దేర్!" అన్నాడు జయకృష్ణ.

మూర్తి ఆలోచనలో పడిపోయాడు.

"థాంక్యూ మిస్టర్ మూర్తి! సీ. యూ. ఎగైన్" అన్నాడు జయకృష్ణ పోలీస్ వ్యాన్ ఎక్కుతూ.

7

"రావోయ్! గోపాల్. రామస్వామి మనకొక తంటా తెచ్చిపెట్టాడు" అన్నాడు సి.ఐ. జయకృష్ణ.

యస్.ఐ. గోపాల్ విష్ చేసి వచ్చి కూర్చున్నాడు.

ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్టు రామస్వామి నవ్వాడు గోపాల్‌ని చూసి.

"ఏమిటి సార్ విశేషం?" అన్నాడు గోపాలా.

"ఏముంది? రాజేశ్వరి కుమారస్వామిని మర్డర్ చేసిందని మనం అనుకుంటున్నాంగదా! ఇప్పుడేమో ఆ కత్తి మీద మరొకరి ఫింగర్ ప్రింట్స్‌గూడా కనిపిస్తున్నాయి. రాజేశ్వరి ఫింగర్ ప్రింట్స్‌గాక వేరే ఎవరివో ఫింగర్ ప్రింట్స్ గూడా వున్నాయి. దాన్నిబట్టి రాజేశ్వరితో పాటు మరొకరు రంగంలోకి దిగారు" అన్నాడు జయకృష్ణ.

"నేను అనుకుంటూనే వున్నాను సార్. ఎంత ధైర్యం గలిగిన ఆడపిల్లయినా ఒక మగాడిని కట్టేసి, కదలకుండా, అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కి చంపగలదా? అని అనుమానం పీడిస్తూనే వుంది. కాని ఏం చెప్పగలం. ఏమో తెగించిన ఆడది ఎంత దారుణమైనా చెయ్యగలదు అని అనుకున్నాను."

"నువ్వలాగే అనుకోగాని ఈ తలనొప్పి వ్యవహారం ఎప్పుడు తేలుతుందో? రాజేశ్వరి మర్డరు చేసిందని తేలి వుంటే అందుకు కారణాలు తెలియకపోయినా కొంప మునిగేది ఏమీ లేదు. కేసు క్లోజ్ చేయించేవాళ్ళం. కాని ఇప్పుడు హంతకుడు యెవరో మరొకరు అని అనుమానిం

చాల్సి వస్తోంది" అన్నాడు జయకృష్ణ.

"విజయవాడ నుంచి మెసేజ్ వస్తే బాగుండును సార్" అన్నాడు గోపాల్.

"నమ్మకం ఏముంది? ఎవరైనా ఇన్ఫర్మేషన్ ఇస్తే గదా తెలిసేది."

"మనం ఏం చెయ్యాలి ఇప్పుడు?"

"వీళ్ళ ఫింగర్ ప్రింట్స్, ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకి పంపుదాం. పాత క్రిమినల్ యెవరైనా ఈ మర్డరు చేసి వుంటే తెలుస్తుంది గదా!" అన్నాడు జయకృష్ణ.

"పాత క్రిమినల్ కాకపోతే!"

"ఫింగర్ ప్రింట్స్ బ్యూరోనుంచి రిపోర్టు రానివ్వు. కాకపోతే అప్పుడే ఆలోచించవచ్చు."

"కీడెంచి మేలెంచమన్నారుగదా! ఈలోపల మన ఇన్వెస్టిగేషన్ సాగించాలి."

"ష్యూర్! ష్యూర్!"

"కుమారస్వామి మర్డర్ కేసు అన్ని పేపర్లలో వచ్చింది చూశారా?"

"ఆఁ....చూశాను."

"మహారాణి హోటల్ మేనేజర్ లబలబ కొట్టుకుంటున్నాడు తన హోటల్ కి చెడ్డపేరు వచ్చిందని."

"మనం ఏం చేస్తాం దానికి. రోజులన్నీ ఒకలాగే వుంటాయా?" అని నవ్వాడు జయకృష్ణ.

"అవుననుకోండి."

"మిస్టర్ గోపాల్ నువ్వొక పని చెయ్యాలి."

"చెప్పండి సార్!"

"రేఖా ఎంటర్ ప్రైజెస్ ఆఫీసుకి వెళ్ళి కొంత సమా

చారం సేకరించుకు రావాలి."

"మీరు వెళ్ళివచ్చారుగా!"

"వెళ్ళాననుకో. కాని ఈసారి మఫ్టీలో వెళ్ళి కుమార స్వామి స్టెనోనిగాని, పర్సనల్ జవాన్నిగాని పట్టుకో. కుమారస్వామి పర్సనల్ లైఫ్ అంటే అతను ఎలా ప్రవ ర్తించేవాడు వీలైనంత రాబట్టు. వాళ్ళలో ఎవరైనా రాజేశ్వరిని ఎరిగిన వాళ్ళు వుంటే వుండొచ్చు."

"యస్సార్. వెంటనే వెళ్తాను. కాని మనం అక్కడికి వెళ్ళి వాళ్ళని బ్రతిమాలేకంటే స్టేషన్‌కి తీసుకొచ్చి అడిగి తేనే నిజం చెప్తారని నా వుద్దేశ్యం."

"నీ ఇష్టం. నేను ఫింగర్ ప్రింట్స్ ఫింగర్ ప్రింట్స బ్యూరోకి పంపే ఏర్పాటు చేస్తూ వుంటాను. నువ్వా పనిలో వుండు" అన్నాడు జయకృష్ణ.

యస్.ఐ. గోపాల్ టెలిఫోన్ డైరెక్టరీ తీసి రేఖా ఎంటర్‌ప్రైజేస్ ఫోన్ నెంబర్ నోట్ చేసుకున్నాడు.

రెండుసార్లు ట్రైచేశాక నెంబర్ దొరికింది.

"రేఖా ఎంటర్‌ప్రైజెస్ ప్లీజ్."

"ఐ వాంట్ మిష్టర్ మూర్తి, మేనేజర్."

"ప్లీజ్ బీ ఆన్ ది లైన్."

కొంచెం సేపటికి రిప్లై వచ్చింది.

"సారీ సర్. మిష్టర్ మూర్తి గాన్ ఔట్‌సైడ్. నా లెమిూజ్ ఎబౌవుట్ ఫోర్ ఓక్లాక్. హీ మేనాట్ కమ్ టూ ఆఫీస్. ప్లీజ్ రింగ్ టూ ఆర్.వీ.ఆర్. క్లబ్ ఆర్ టూ హిజ్ రెసిడెన్స్."

"థాంక్స్."

గోపాల్ టెలిఫోన్ క్రెడిల్ మీద పెట్టేశాడు.

"ఎవరికి ఫోన్."

"వాళ్ళ మేనేజర్ మూర్తి వున్నాడేమోనని ఫోన్ చేశాను. లేడట."

"అతనెందుకు? అయినా అతనికి ఏమీ తెలియదు. అతని గొడవ అతనిదే. తన చెల్లెల్ని ఇచ్చాడు కాబట్టి కుమారస్వామి మంచివాడు, బుద్ధిమంతుడూ అంటూ చెప్పుకొచ్చాడు."

"ఇంటిగుట్టు రచ్చకెక్కించుకుంటారా ఎవరైనా?"

"అంతే....అంతే...."

"నేను మేనేజర్ని కలుసుకోవడానికి కాదు ఫోన్ చేసింది."

"మరి?"

"అతను లేనప్పుడు వెళ్తే పని సులభంగా వుంటుంది. తీరా అతను వుంటే వాడికి ఏదైనా హైడెన్సు ఇవ్వొచ్చుగా!"

"నీ ఐడియా కరెక్టే."

"ఇప్పుడే వెళ్ళి కుమారస్వామి పర్సనల్ జనాన్ని పిల్చుకుని వస్తాను" అన్నాడు యస్.ఐ.

"వెళ్ళిరా!"

యస్.ఐ. వెళ్ళాడు.

జయకృష్ణ, డియస్పీ ఇంటికి వెళ్ళి మాట్లాడి వచ్చేసరికి స్టేషన్లో ఒక కుర్రాడు కూర్చుని వున్నాడు.

సి.ఐ. ని చూసి విష్ చేశాడు అతను.

"ఇతను కుమారస్వామి స్టెనో. మిష్టర్ రాఘవ" అన్నాడు యస్.ఐ.

తల వూపాడు జయకృష్ణ.

"ఏమిటి సంగతులు. మనకి పనికివచ్చే సమాచారం ఏదైనా వుందా?" ప్రశ్నించాడు సి.ఐ.

"ఇతను చెప్పే సంగతులు వింటూ వుంటే మతిపోతూ వుంది. కేసు మరొక మలుపు తిరిగేటట్లుంది" అన్నాడు యస్.ఐ.

"ఏమిటి?" ఆసక్తిగా ప్రశ్నించాడు.

"మూర్తి చెప్పినవాటికి ఇతను చెప్పేవాటికి పోలికలే లేవు. కుమారస్వామికి అన్ని అలవాట్లూ వున్నాయట. పైగా మహారాణి హోటల్ అతని బృందావనమనీ, అతనొక అపర శ్రీకృష్ణుడనీ చెప్తున్నాడు."

"అయితే మూర్తికి బావగారి సంగతి తెలిసి వుండకుండా వుండాలి. లేదా కావాలని మనతో అబద్ధాలు చెప్పి వుండాలి" అన్నాడు జయకృష్ణ.

"గొప్పవారి గోత్రాలు అంతే సార్" అని నవ్వాడు రాఘవ.

"అంతేకాదు సార్ రాఘవ మరొక ఆసక్తికరమైన సంగతి బైటపెట్టాడు."

"ఏమిటి?"

"కుమారస్వామి భార్య అరుణ కారెక్టర్ మంచిది కాదట."

"ఈజిట్?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సి.ఐ.

"అందులో ఆమె తప్పు ఎంతమాత్రమూ లేదుసార్. భర్త వ్యభిచారి. వారానికి ఒకరోజైనా పెందరాళే ఇంటికి చేరుకుంటే గొప్ప. ఎప్పుడూ క్లబ్బు పేకాట, హోటళ్ళలో క్యాబరే డ్యాన్సుల కాలక్షేపం. గొంతు వరకూ తాగి హోటల్లోనే మండలతో మకాం. ఆమె మాత్రం ఏం చేస్తుంది? ఉప్పూ కారం తినే మనిషేగదా!" అన్నాడు రాఘవ.

"ఇంతకీ నువ్వు చెప్పేది సూటిగా చెప్పవయ్యా!"

అన్నాడు సి.ఐ.

"చెప్తాను సార్! కాని నన్ను మాత్రం ఈ కేసులో ఇరికించకండి. నా పేరు బైటపెడితే నా వుద్యోగం పోతుంది" బెరుగ్గా అన్నాడతను.

"నో....నో....అలా జరగదు చెప్పు" హామీ ఇచ్చాడు.

"కిరణ్ కుమార్ అని అసిస్టెంట్ మేనేజర్ వున్నాడు సార్. మూర్తిగారి తర్వాత అతనిదే పెత్తనం. ఫైల్సు మీద డిస్కషన్స్‌కనీ, చెక్కులమీద సంతకాలకనీ మూర్తిగారికోసం ఇంటికి వెళ్తూ వుంటాడు సార్! ఎలా కలిసిందోగాని మూర్తిగారి చెల్లెలు అరుణతో సంబంధం కుదిరింది సార్!"

జయకృష్ణ ఆశ్చర్యంగా వింటున్నాడు అతను చెప్పేదంతా.

"ఇదంతా నీకెలా తెలుసు?"

"ఇటువంటివి ఎలా తెలుస్తాయి సార్! ఇంట్లో పని మనుషులద్వారా! వాళ్ళ ప్రవర్తనద్వారా! నాకే కాదు సార్! మా కంపెనీలో చాలామందికి తెలుసు వీళ్ళ వ్యవహారం. అందరికీ తెలిసినా ఎవరికీ తెలియనట్లు ప్రవర్తిస్తూ వుంటారు సార్! అసలు ఇదంతా ఆమె భర్తకి, అన్నకి గూడా తెలుసేమోనని నా అనుమానం. ఎందుకంటే రెండు నెల్ల క్రితం కిరణ్ కుమార్ వుద్యోగం పోయింది."

"ఐ.సీ...." అన్నాడు జయకృష్ణ ఏదో ఆలోచిస్తూ.

"వీళ్ళ ప్రవర్తన విచ్చలవిడిగా వుండి వుంటుంది. అందుకే కట్ చేసి వుంటారు."

"అది సరే. కుమారస్వామి మర్డర్ గురించి మీరేం చెప్తారు?"

"నేను అనుమానించడం కిరణ్ కుమార్‌నే. కుమార

స్వామి భార్య, కిరణ్ కలసి ఈ మర్డర్ చేయించి వుంటా రని నా అనుమానం. ఎందుకంటే కిరణ్ కుమార్‌కి ఇంకా పెళ్ళికాలేదు. భర్తపోయాక తన కనుసన్నలలో వుండే ఇతన్ని చేపట్టవచ్చని ఆమె అనుకుని వుండొచ్చుసుగదా!"

"మీది కేవలం అనుమానమేనా లేక ఏదైనా ఆధారం చూపగలరా? ఇంతకీ రాజేశ్వరిని మీరెప్పుడైనా చూశారా?" ప్రశ్నించాడు సి.ఐ.

"రాజేశ్వరి ఎవరో నాకు తెలియదు. నేనెప్పుడూ చూళ్ళేదు. ఆ రాజేశ్వరి ఏ బ్రోతల్‌లో అయివుంటుంది సార్! ఇదంతా గూడా పైడితల్లి ద్వారా జరిగివుంటుందని నాకు అనుమానం" అన్నాడు రాఘవ.

"పైడితల్లి ఎవరు?"

"పైడితల్లి కుమారస్వామి జవాన్ సార్! ఈ మర్డర్ జరిగిన మర్నాటినుంచే వాడు కనిపించడంలేదు. నాకు వాడి మీదే అనుమానం. డబ్బు ఆశపెడితే ఎలాంటి పనికైనా సిద్ధమే వాడు."

"ఐ.సీ.... పైడి తల్లి అడ్రస్ తెలుసా?"

"తెలుసు సార్! మా వర్కర్సు అడ్రసులన్నీ మా రికార్డులో వుంటాయి. చూసి చెప్తాను."

"ఫోన్ చేసి చెప్పండి."

"నో సార్! నేను రేపు నోట్ చేసి స్వయంగా అందజేస్తాను."

"కిరణ్ కుమార్ ఏం చేస్తున్నాడు ప్రస్తుతం?"

"ఏం చేస్తాడు సార్? రోడ్లు సర్వే చేస్తున్నాడు" అంటూ నవ్వాడు రాఘవ.

"కిరణ్ కుమార్ అడ్రస్ గూడా కావాలి."

"అలాగే సార్, పైడితల్లి అడ్రస్‌తో పాటు కిరణ్

కుమార్ అడ్రస్ గూడా తెలియజేస్తాను."

"ఓ.కె. థాంక్స్" అన్నాడు జయకృష్ణ.

8

"గుడ్ మార్నింగ్ సార్!" అంటూ ప్రవేశించాడు రామస్వామి.

"కమిన్ రామస్వామీ!" అన్నాడు సి.ఐ.

బ్రౌన్ కలర్ కవరులో నుంచి ఫింగర్ ప్రింట్స్ తీసి సి.ఐ. ముందు వుంచి "నిన్న మీరు పంపిన టీ గ్లాస్ మీద ఫింగర్ ప్రింట్స్ తీశాను సార్" అన్నాడు.

"అవి కిరణ్ కుమార్ వి. కత్తిమీద ప్రింట్స్ తో టాలీ అయ్యాయో లేదో చూశావా?"

"చూశాను సార్! అవి కిరణ్ కుమార్ వి కాదు" అన్నాడు రామస్వామి.

"కాదా!...." అంటూ నిరుత్సాహ పడ్డాడు జయకృష్ణ.

ఇంతలో స్టేషన్ బైట పోలీస్ వ్యాన్ ఆగింది.

ఇద్దరు కానిస్టేబుల్స్ ఒక బక్క మనిషిని బలవంతంగా లాక్కొని వస్తున్నారు. వాడు గిలగిల కొట్టుకుంటున్నాడు భయంతో. యస్.ఐ. గోపాల్ నవ్వుకుంటూ లోపలకు వచ్చాడు.

"ఎవరు అతను?" ప్రశ్నించాడు సి.ఐ.

"వాడేసార్ పైడితల్లి. వూళ్ళోనే వున్నాడు కాని ఇంట్లో లేడు. వాళ్ళ బావమ్మర్ది ఇంట్లో మకాం పెట్టాడు. వెతికి పట్టుకొన్నాను" అన్నాడు యస్.ఐ.

పైడితల్లి లోపలకు వస్తూనే అమాంతం సి.ఐ. కాళ్ళ మీద పడిపోయి ఏడవసాగాడు.

"నాకేం తెలియదుసార్!"అంటూ శోకాలు పెట్టాడు.

కానిస్టేబుల్ బలవంతాన పైకి లేపి నిల్చోబెట్టాడు.

"ఎందుకు అలా ఏడుస్తావ్?" విసుగ్గా అన్నాడు సి.ఐ.

"నాకే పాపం తెలియదు సార్. నన్ను అన్యాయంగా పట్టుకున్నారు సార్!" ఏడుస్తూనే చెప్తున్నాడు పైడితల్లి.

"తెలిసింది చెప్పు. లేకపోతే పదేళ్ళు జైలు పడుతుంది."

"నాకేం తెలుసు సార్?"

"ఏం తెలియకపోతే డ్యూటీ మానుకుని నీ బామ్మర్ది ఇంట్లో యెందుకు దాక్కున్నావ్?" గద్దించాడు సి.ఐ.

"చెప్పు. కిరణ్ కుమార్ నీతో ఏం చేయించాడు? ఆ రాజేశ్వరి ఎవరు? నిజం చెప్పు."

"కిరణ్ బాబు నాకేం చెప్పలేదు సార్!"

"మరి యెవరు చెప్పారు? ఏం చేయించారు? నిజం చెప్తే వదిలేస్తాం. లేదా మరి ఇంటికి వెళ్ళవ్!"

"ఆ అమ్మ ఇంతపని చేస్తదని తెలియక బుద్ధి గడ్డితిని ఆ పని చేసాను సార్!"

"ఏ అమ్మ?"

"ఆ అమ్మే సార్! రాజేశ్వరమ్మ."

"వూఁ.... చెప్పు. రాజేశ్వరి ఎవరు? నువ్వు ఏం చేశావు?"

"ఎవరో నాకేం తెలుసు సార్! ఒకరోజు నేను డ్యూటీచేసి ఇంటికి పోతుంటే పలకరించింది. వాళ్ళ అన్న యెవడో వున్నాడంట. ఆడికి వుద్యోగం కావాలంట. డైరెక్టర్ని కలుసుకునే మార్గం చెప్పమంది. మామూలు సంగతే గదా అని అయ్యగారికి చెప్పాను. అయ్యగారు ఆవిడని మిహారాణి హోటల్లో వుంచి రమ్మన్నారు. అంతే సార్! ఆ తర్వాత నాకేం తెలియదు."

"పోనీ రాజేశ్వరి ఏ వూరునుంచి వచ్చిందో నీకు

తెలుసా?"

"విజయవాడ నుంచి వచ్చానని చెప్పింది సార్. వాళ్ళ అన్నకి వుద్యోగం గురించి అయ్యగారితో మాట్లాడటానికి వచ్చానని చెప్పింది. అంతేసార్. అంతకంటే నాకేం తెలియదు" అన్నాడు పైడితల్లి కళ్ళు తుడుచుకుంటూ.

"వీడిని లాకప్‌లో పడెయ్యండి" అన్నాడు సి.ఐ. లేచి నిల్చుని.

"సార్! అన్యాయం సార్! నాకే పాపం తెలియదు సార్!" పైడితల్లి గోల పెడుతుంటే కానిస్టేబుల్స్ లాక్కెళ్ళి లాకప్‌లో పడేసి తాళం పెట్టారు.

"కేసు కొంచెం క్లియరయినట్లు కనిపిస్తోంది గోపాల్. వీళ్ళ కంపెనీలో ఏదో వుద్యోగాల గొడవ అనుకుంటాను. ఎవరో వుద్యోగం రాలేదని కసితో అతన్ని మర్డరు చేసినట్లుంది. వాళ్ళెవరో విజయవాడ నుంచి వచ్చివుండాలి. అతను రాజేశ్వరి అన్న ఏమో? తెలుసుకోవాలి. నేను మూర్తిని కలుసుకుని వస్తాను" అన్నాడు జయకృష్ణ.

తల వూపాడు గోపాల్.

జయకృష్ణని చూస్తూనే "రండి....రండి...." అని ఆహ్వానించాడు.

"కేసుకి క్లూ దొరికింది."

"చెప్పండి."

"ఈ మధ్య మీ కంపెనీలో ఏవైనా వుద్యోగాలకి ఇంటర్వ్యూలు జరిగాయా?"

"వూఁ. జరిగాయి. ఎక్కౌంటెంట్స్, టెక్నీషియన్స్ వగైరా దాదాపు పాతిక వేకెన్సీలు ఫిలప్ చెయ్యాలని పేపర్‌లో అడ్వర్టైజ్ చేశాం. ఇంటర్వ్యూలు జరిగాయి కూడా. అప్పాయింట్‌మెంట్స్ పంపలేదు ఇంకా. ఈ

లోపల ఈ దారుణం జరిగింది" అన్నాడు మూర్తి.

"విజయవాడ నుంచి వచ్చిన కాండిడేట్స్ లిస్ట్ తియ్యండి" అన్నాడు జయకృష్ణ.

మూర్తి బజ్జర్ నొక్కి బాయ్ రాగానే "ఏ.యమ్‌ని పిలువు" అన్నాడు.

అసిస్టెంట్ మేనేజర్ వస్తూనే ఇద్దరికీ విష్ చేశాడు.

"వేకెన్సీలు ఫిలప్ చెయ్యడానికి అప్లికేషన్స్ కాల్ ఫర్ చేశాంగదా! ఆ ఫైల్ తీసుకురండి" అన్నాడు మూర్తి.

అతను కాసేపటికి ఫైల్ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

మూర్తి తల వూపాడు అతన్ని వెళ్ళమన్నట్టుగా.

మూర్తి ఫైలు తిరగేసి "మొత్తం నలుగురు వున్నారు సార్!" అన్నాడు.

"కథంతా ఈ నలుగురిలోనే వుంది," అన్నాడు జయకృష్ణ.

"ఎలా?"

పైడితల్లి చెప్పినదంతా చెప్పాడు జయకృష్ణ.

అంతా విని "నాకు తెలియదు మావాడి వ్యవహారం. అయితే పైడితల్లి అన్నీ ఎరేంజ్ చేస్తుంటాడన్నమాట రాస్కెల్," అన్నాడు మూర్తి.

"వాళ్ళ అడ్రస్‌లు నోట్ చేసి ఇవ్వండి. వీళ్ళలో ఎవరో ఒకరికి రాజేశ్వరి చెల్లెలు కావచ్చు. అది తేలితే మబ్బు విడిపోయినట్లు కేసు తేలిపోతుంది. హంతకుడు దొరికిపోతాడు." అన్నాడు జయకృష్ణ.

మూర్తి నలుగురి అడ్రస్‌లు కాగితంపై నోట్ చేసి ఇచ్చాడు.

"విజయవాడ వెళ్ళిరావాల్సి వస్తుంది. తర్వాత కలుస్తాను." అని సెలవు తీసుకుని వచ్చేశాడు జయకృష్ణ.

9

రాజశేఖరానికి బేడీలు వేసి నిల్చోబెట్టారు పోలీస్ స్టేషన్‌లో.

ఫింగర్ ప్రింట్స్ తియ్యడానికి స్టాంప్ పాడ్ తెస్తూ వుండగా అన్నాడు రాజశేఖర్. "ఎందుకూ ఆ ఫార్సంతా నేను ఒప్పుకుంటున్నాను గదా! వాడిని మర్డర్ చేసింది నేనే."

"చేసినవాడివి అప్పుడే ధైర్యంగా నిలబడివుంటే నీ చెల్లెలు చనిపోకుండా వుండేది గదా! అంత పిరికివాడివి మర్డర్ యెలా చేశావు?"

తన చెల్లెలు గుర్తుకు రాగానే రాజశేఖర్ ముఖం విషాదమైంది. వర్షం కురిసేముందున్న ఆకాశంలాగా నల్లబడింది ముఖం.

"నిజమే సార్! తప్పు చేశానేమోనని ఇప్పుడనిపిస్తోంది." అన్నాడు.

"అసలు యేం జరిగిందో చెప్పు?"

"ఏం చెప్పను సార్! జరిగిందంతా ఒక ట్రాజెడీ. నా జీవితమే ఒక ట్రాజెడీ," అన్నాడు రాజశేఖర్.

"చదువుకున్నవాడివి మర్డర్ చేశావంటే నమ్మలేకుండా వున్నాను. ఎంతో బలమైన కారణం వుంటే గాని ఒక మనిషిని మరొకమనిషి చంపలేడు. చెప్పు? ఏం జరిగింది?"

"ఇదంతా నా పొరపాటువల్లనే జరిగింది సార్!"

"నీ పొరపాటా?"

"అవును సార్. రేఖా ఎంటర్ ప్రైజెస్ వాళ్ళు ఎకాం

మెంట్ జాబ్‌కి నన్ను ఇంటర్వ్యూకి పిలిచారు. ఇంట ర్వ్యూకి వెళ్ళాను. నలుగురు ఇంటర్వ్యూ చేశారు.

అందులో మేనేజింగ్ డైరెక్టర్‌ని చూసి నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే అతను విజయవాడ కాలేజీలో చదువుకున్నవాడే. నాకు జూనియర్. మా రాజేశ్వరిని అల్లరి పెట్టినందుకు చితుగా తన్నాను ఒకరోజు. నేనంటే వాడికి కోపం. ఎన్నో ఏళ్ళ తర్వాత మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో అతను నా భవిష్యత్తు నిర్ణయించగల పొజిషన్‌లో వున్నాడని అనుకునేసరికి నా మనస్సు చెడిపోయింది.

ఇంటర్వ్యూ సరిగా చేయలేకపోయాను. వాడు నా మీద కోపంతో ఆ జాబ్ నాకు రాకుండా చేస్తాడని వూహించాను. నిరాశతో విజయవాడ తిరిగి వెళ్ళిపోయాను. ఆ సంగతి రాజేశ్వరికి చెప్పాను. మామూలుగా మర్నాడు వేరే పనిమీద వైజాగ్ వెళ్ళాను. అక్కడొక ఫ్రెండ్ వుద్యోగానికి సహాయం చేస్తానన్నాడు. ఎంతో ఆశతో వెళ్ళాను.

నిజానికి యెంత చిన్న వుద్యోగమైనా అవసరం నాకు. మా నాన్న రిటైర్డు గుమస్తా. నూటఏభై వస్తుంది పెన్షన్. పైగా ఆయన జబ్బు మనిషి. నేను, అమ్మ, చెల్లెలు, తమ్ముడు ఇంతమంది ఆ పెన్షన్ మీదే ఆధారపడ్డామంటే పరిస్థితులు ఎంత దారుణంగా వుండి వుంటాయో మీరు వూహించుకోవచ్చు.

రెండు రోజుల తర్వాత నేను వైజాగ్ నుంచి వచ్చేసరికి రాజేశ్వరి ఇంట్లో లేదు. నాకు వుద్యోగం రావడానికి ప్రయత్నం చేస్తానని చెప్పి వెళ్ళినట్లు తెలిసి ఆశ్చర్యపోయాను. దరిద్రం భరించలేక రాజేశ్వరి సిగ్గు విడిచి

వాడిని ప్రాధేయపడటానికి వెళ్ళిందని తెలిసి నా కడుపు మండిపోయింది. తీరా అది వాడిని కలుసుకుంటే యేం జరుగుతుందో వూహించుకునేసరికి నా రక్తం వుడికి పోయింది. వాడు....ఆ పశువు రాజేశ్వరి శీలాన్ని చెరుస్తాడు. నో....అలా జరగడానికి వీల్లేదు....దరిద్రంతో ఇంటిల్లపాదీ మాడిపోయినా సరే!

తక్షణం లాకీ పట్టుకుని వెళ్ళాను. చివరికి పైడితల్లి చెప్పాడు రాజేశ్వరి అనే అమ్మాయి మహారాణి హోటల్లో వుందనీ, రూమ్ నెంబర్ 116 అని. ఆవేశంతో వెళ్ళాను. అప్పటికి రాత్రి యెనిమిది కావొచ్చింది. నేను అనుకున్నట్లే వుంది ఆ రూమ్‌లో పరిస్థితి.

నాకు గతమంతా గుర్తుకొచ్చింది. రాజేశ్వరి నన్ను చూసి కొయ్యబారిపోయింది. వాడు త్రాగిన మైకంలో బూతులు తిట్టాడు. రూమ్ తలుపులు మూసి వాడిని మర్డర్ చేసి వచ్చేశాను. వాడితోపాటే నా చెల్లెల్ని గూడా చంపాలనుకున్నాను కాని చంపలేకపోయాను.కాని చచ్చి పోయిందని భావించి వచ్చేశాను."

"కాని నువ్వు చేసిన పొరపాటు యేమిటో నీకు తెలిసిందా?"

"తర్వాత తెలిసింది సార్. ఆ మేనేజింగ్ డైరెక్టర్ పేరు కుమారస్వామి అనీ, నా శత్రువు అతని తమ్ముడు సుధాకర్ అనీ తర్వాత అంతా ఐపోయాక తెలిసింది సార్!" విచారంగా అన్నాడు రాజశేఖర్.

—ఐపోయింది—